కవితా కౌముది

# భయం..భయంగా..

బొబ్బు హేమావతి

నన్ను నేను తప్పించుకొని తిరుగుతున్నాను
ఎండనక వాననక పగలనక రేయనక
కంటిచూపు మేరలో కానరాలా ఎవ్వరూ
అయినా ఎందుకో భయం గుప్పెట్లో
చిన్న చిరు చప్పుడుకే తత్తర బిత్తర పడి
కాళ్ళ గజ్జలు ఎక్కడ చప్పుడు చేస్తాయోనని
అడుగు తీసి అడుగు వేస్తూ!
అర మైలు దూరం నడిచినంతలోనే అలుపు తీర్చుకొంటూ
వగరొస్తూ సెగలు పోస్తూ
భయం గుప్పెట్లో నేను
కానరాని కారడివా అంటే కానే కాదు
ఘాండ్రించే పులులు
పాకే పురుగులు తిరిగే నడవా కాదు
నరబలులు కోరే నేర ప్రపంచం
రక్తాన్ని పీల్చే నరలోకం
ఎవ్వరు మన పురుషులో
ఎవ్వరు పరపురుషులో
తెలియని మాయ లోకం
వలపు తాడో పలుపు తాడో
తెలియక అమాయకపు బిత్తర చూపులతో
చిత్తడి నేలపై వెనుదిరిగి చూస్తూ
ముందడుగు వేసి వేయలేక పక్కల చూస్తూ
రాబందుల భయంతో నేను !!!!

★★★

# మరలా..
## లక్ష్మీ కందిమళ్ళ

ఎవరికైనా
ఎలా చూపగలవు
ముసురు పట్టిన మబ్బుల్లో

ఎక్కడో వాన
బతికివున్న ఆనవాళ్ళు ఇంకా

మరలా రెక్కలు వచ్చిన పక్షిలా
తెప్పరిల్లుకొని
నిజాయితీగా అడుగుతావు
శతాబ్దాల నీ లక్ష్యాన్ని
గుర్తు చేసుకుంటూ

అదంతా ఒక కథలా
సాగుతూ ఉంటుంది
ఒక పుస్తకం అవుతుంది
అనేకానేక సంఘటనలతో..

★★★

# సర్దుకోకండి
## అల్లూరి గౌరీలక్ష్మి

అవతారం చాలించే ఘడియొకటొస్తుందని
అప్పటికి సర్వం సిద్ధంగా ఉండాలని
ఆపై నిర్విచారంగా నిష్క్రమించాలని
సిద్ధులు చెప్పిన బోధలు విని విని

నీ కథకొక రోజు తెరపడుతుందని
సర్దుకోవడం ఇప్పుడే మొదలు పెట్టొద్దు
అంతా సిద్ధంగా ఉన్నప్పుడది రానే రాదు
చేతిలోముద్దనోటికిచేరేలోపున వస్తుందది

సర్దుకుంటున్నావంటే భ్రమనొదలనట్టే
నువ్వసలైన వైరాగ్యంలోకి ఇంకా రానట్టే
నీ తర్వాత సంగతి చెబుతున్నావంటే
నీకు పక్కకి జరగాలని పూర్తిగా లేనట్టే

వెళ్ళడానికి తయారవడం అంటే
ఉన్నపళంగా ఎక్కడివక్కడొదిలేసి
సిరికి చెప్పని విష్ణువల్లే పరిగెత్తడమే
చేలగట్లపై ఎగిరే కులాసా కొంగలు
తుపాకీ శబ్దానికి మాయమయినట్టే

వళ్ళుమరిచి ఆడుకునే పిల్లాడు
తండ్రి కేకకి చప్పున తెలివితెచ్చుకుని
తమ ఇంటికి అదే పరుగు తీసినట్టే
కన్నతల్లి చంకనెక్కి చెయ్యూపుతూ
ఒకేసారి అందరి జ్ఞాపకాల్లోకి విస్తరించడమే! ★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

కుండపోతగ వర్షమ్ము కురియుచుండె
దడదడమటంచు ధారలు పడుచునుండె
గుండియలు దడదడ కొట్టుకొనెడు రీతి
ఆగవలదిది కానోపునమృతధార

ఇది యమృతధారయో లేక పృథివినెల్ల
ముంచెడు ప్రళయధారయో యంచునెదను
సందియమ్ములు మెండుగ దండడించు
ప్రకృతి చిలికెడు కరుణాంబురాశి యిద్ది

వర్షమా మమ్ము స్పృశియించి పలకరించి
కరుణనమృతధారలనిట కురియజేసి
ధరణినెల్లనునానందఝరుల నింపి
మరల మరల మాకొరకీవు మరలి రమ్ము

ఒసగుచుంటివి బహుసుధారసము మాకు
అమృతమయమయ్యె నీవల్లనవని యెల్ల
ప్రాణముల నిల్పగల్గు జీవనము దక్కె
వార్షుకాంబువుల్లేక జీవమ్ము గలదె

ధరణి నీ స్పర్శచేనయ్యె హరితమయము
ప్రళయదృక్కులు వలదు మాపైననెపుడు
సకలజనరంజకమ్మైన జగమునిమ్ము
క్షేమదాయకమైన యాశీస్సులిమ్ము

COMMENTS